కథానిక

# కులతత్వానికి ఎడా-పెడా

డొంకాడ రామలింగస్వామి

అమాయికంగా ఆనందంగా గడపిన బాల్యం, ఏమేమో కలలుగంటూ ఉత్తమోత్తమాశయాలతో, ఆశలతో పూర్తిచేసిన విద్యార్థి జీవితం, సంసారభారాన్నెదుర్కొనేటందుకు ఆర్థిక సమస్యల్లోపడి నలిగిపోవడం, ఉద్యోగ తాపత్రయం, కడకు నిరాశతో నిరుద్యోగి కావడం, వగైరా వగైరా సామాన్య జీవితఘట్టాలన్నీ రామం జీవిత గాథలో మామూలుగానే గడచిపోయేయ్. గడచిన జీవితమంతా బూడిదలో పోసిన పన్నీరై పోయినా తన అనుభవం లోనుంచి ఒక అమూల్య సత్యాన్నిమాత్రం గ్రహించ గలిగేడు రామం.

"వాస్తవికప్రపంచంలో ఆశయాలకూ, నీతికీ నిజాయితీకి స్థానంలేదు. జీవితాన్ని సార్థకం చేసుకోవాలంటే మానవుడు తన లౌకిక జ్ఞానాన్ని, ప్రపంచ ప్రస్తుత పరిస్థితులకనుగుణ్యంగా వినియోగించాలి." ఈనాడయినా ప్రపంచాన్ని అర్థం చేసుకొని మానవ కల్యాణానికి ఒక కీలకం కనిపెట్టినందుకెంతో మురిసిపోయేడు రామం.

పెట్టి బెడ్డింగుసర్దుకొన్నాడు రామం ప్రయాణానికి బట్టలు సర్దుతూంటే చినిగిపోయిన కోటు జేబులో విద్యార్థి జీవితంలో తాను ముచ్చటగా మూడురూపాయిలిచ్చి కొన్న మనీపర్సు దొరికింది, విప్పిచూసేసరికి చెల్లని అణా కనిపించిందతనికి! ఈ హడావుడినంతా ఆశ్చర్యంగా తిలకిస్తూ కూర్చుందతని భార్య, లక్ష్మి.

"లక్ష్మీ, మాట..."

"ఏం, ఏం ముద్దుముక్కలైంది?" అని పెదవులు విరుచుకుంటూ వచ్చింది.

"మరేం లేదు..."

"ఇంకా ఏం కావాలేం?"

"మరి — నేను"

"ఇంటర్వ్యూకెళ్ళాలి కాబోలు దొరగారు! ఇంకా ఏముంచేరుగనక, మావాళ్లుపెట్టిన వంపెడు నగలూ —"

"ఇంటర్వ్యూకాదులక్ష్మీ-ఉద్యోగం! ఉద్యోగం దొరికింది మెడ్రాసులో!" లక్ష్మిని ఆలోచించకుండా జవాబిచ్చేడు రామం. ఇంతపులీ నోరు చాచి, "ఆఁ"అని-విడ్డూరంగా నిల్చుండిపోయింది మేకలా! రామం చెప్పుకు పోతున్నాడు.

"నెలకు నూటయాభై రూపాయలు జీతం, మూడు నెలల్లో ప్రమోషన్ వస్తుంది, రెండు వందలుజీతం. సంవత్సరంలో గెజిటెడ్ ఆఫీసర్ ర్యాంక్, అయిదువందలు, కారూ బంగళా బంద్రోతులూ...లక్ష్మీ! క్షమించు. మీవాళ్ళు పెట్టిన బంగారమంతా తిన్నాను. అయితేనేంలే లక్ష్మీ మళ్ళీసంవత్సరంలో అన్నీ చేయించేస్తాను.నీతోడు లక్ష్మీ నన్ను నమ్మవూ" అని దీనంగా మొహం పెట్టేడు రామం.

ఇంత లక్ష్మీదేవీ చలించిపోయి కరిగిపోయింది. "అదేమిటండీ, బొత్తిగా చిన్నపిల్లలై పోతున్నారు" ఆమె మెడ్రాసు మెరీనాబీచిరోడ్డులో రోల్స్‌రోయిస్ కారులో విహరిస్తోందప్పుడే!

"నేను యివాళ మెయిలులో వెళ్ళి ఉద్యోగంలో చేరి మంచియిల్లుచూసి ఉత్తరం రాస్తాను. నువ్వు పిల్లల్ని తీసుకొని వచ్చేయ్. ఏం లక్ష్మీ అంతేనా?"

"అలాగే. మీకేమీ మంచీచెడ్డా తెలియదు. కాస్త మంచి విశాలమయిన యిల్లు చూడండేం. రెండుమూడు గదులు, వంటగదీ, మంచియినుగూ పొరుగూ — మరి వేగం ఉత్తరంరాస్తారుకదూ?"

"నాకుతెలియవటే అవన్నీ. కాని వెళ్ళడానికే కొంచెం యిబ్బందిగాఉంది. మన వెంకటేశంగాడిని అడిగితే వాడికింకా జీతం అందలేదట, సుబ్బారావుకేమో —"

"అయ్యో వాళ్ళజిహ్వపడిపోనూ, ఎంతఅబద్ధమాడేరండీ. ఉదయమేగా వాళ్ళ పెళ్ళాలు రెండేసివందలిచ్చి చీరలుకొన్నారూ? అయ్యో విడ్డూరమా! మనం యిస్తే యిచ్చేయం, తక్కువబుద్ధులు కాకపోతే! పోనీలెండి మళ్ళీ చేయించుకోవచ్చుగాని యీ గాజులజత అమ్మేయండి. ఉద్యోగం

మానేస్తామా గాజులకోసం" అని రెండు బంగారపుగాజులూ బయటకుతీసింది ఎంతో త్యాగ బుద్ధితో.

"అదేమిటి లక్ష్మీ-ఎందుకూ వద్దులే. నీ సహజ సౌందర్యానికి వస్తువులేమీ లేకపోయినా ఫర్వాలేదు కాని ఆమిగిలిన రెండు గాజులయినాఉండనియ్" అని కాస్తసేపు బెట్టుసరిచేసి తీసుకొని జేబులో వేసుకొన్నాడు భద్రంగా. ఆడంబరాలకు అలంకారాలకుసంబరపడే స్త్రీ సహజమనోదౌర్బల్యానికి ఎరవేసేడు రామం. "తన సౌందర్యం"అనేసంకుచితత్వానికిలొంగిపోయిందిఆడది!

ప్రయాణానికి అన్ని హంగులూ సమకూర్చుకొని మద్రాసు మెయిలెక్కేడు రామం. నిల్చోడానికి కూడా స్థలం లేదాపెట్టెలో. అలానిల్చుని ఆ రాత్రంతా ఎలా గడపడమో అర్థంకాక అతనికి ముచ్చెమటలూ పోసేయ్. పెట్టంతా ఒకసారి పరికించి చూచేడు, కాని ఏంలాభం కాలు కదపడానికి కూడా వీలులేదు. ఒక బల్లమీద మాత్రం ఒక యువకుడు బెడ్డింగు విశాలంగా పరుచుకొని ఏదో ఒక హిందీ పేపరు చదువుతూ కూర్చున్నాడు. రామానికి కొంచెం ఆశ కలిగింది.

ఇంతలో ఒక వృద్ధుడు "బాబూ! కాస్త బెడ్డింగు తీస్తారూ, పిల్లలు కూర్చుంటారు"అన్నాడత్యంతనితో. తానింకా అడుగుదామనుకుంటుంటే యీ ముసలివాడా ఛాన్సు కొట్టేస్తున్నందుకు రామానికి కొంచెం బాధనిపించింది. అ యి నా "పిల్లలకోసం కదూ, పాపం"అని జాలిపడిందతని ఆత్మ. ఆ యువకుడేమీ చలించలేదు. మళ్ళీ మెల్లగా చెప్పేడా వృద్ధుడు.

"క్యా మై మద్రాస్ జారహాహూఁ" అని హిందీలో చెప్పి, ఒకసారి ఎర్రగాచూచి మళ్ళీ తన చదువులో మునిగిపోయేడా యువకుడు. వాడిని యీ చెంపా ఆచెంపా రెండు వాయిద్దామనుకున్నాడు రామం. కాని పూర్వానుభవం వద్దని ఆదేశించగానే తన ప్రయత్నాన్ని విరమించుకున్నాడు. రెండుమూడు స్టేషన్లు దాటిపోయేయ్. రామం మెల్లగా నోరు విప్పేడు హిందీలో.

"తమరెక్కడకు వెళ్తున్నారు?"

"మద్రాసు వెళ్తున్నాను" అన్నాడు ముక్తసరిగా.

"ఎక్కడనుంచి?"

"లక్నో."

"ఏమిపనో తెలుసుకోవచ్చా?"

ఈసారి లొంగిపోయేడు యువకుడు. "ఏజెంటును-తమరు?" ఇంతసేపూ మాట్లాడి ఆమాత్రమైనా అతనిగురించి తెలుసుకొనకపోతే యేం బాగుంటుందన్న మొగమాటంలో నలిగిపోయేడు.

"నేనుకూడా లక్నోలోనే చదువుతున్నాను" తడుముకోకుండా అబద్ధమాడేడు రామం. ఈ జవాబుతో చల్లబడిపోయేడా యు వ కు డు. ఎక్కడవిన్నా తెలుగుభాషే వినిపించే పరాయి రాష్ట్రంలో, తన మాతృభాషలోనే మాట్లాడే రామం, తనిదేశంలోనే చదువుతున్న వ్యక్తి కనిపించేసరికి, ఆ యువకుని కెక్కడలేని ఆనందం కలిగింది. ప్రాంతీయభాషాభిమానాల తనని వశం చేసుకున్నాయ్! ఈ సంకుచితత్వమే మానవుని దౌర్బల్యం.

"ఆహాఁ అలాగా! రండి, కూర్చోండి... మీ పేరు?" ఆ యిద్దరూ సంభాషణలో మునిగి పోయేరు. మద్రాసు చేరేలోపల వాళ్ళిద్దరూ ప్రాణస్నేహితు లైపోయేరు. సిగరెట్లు, కాఫీ టిఫెన్లువంటి చిల్లరఖర్చులన్నీ ఆ యువకుడే భరించేడు.

మద్రాసులో రామం ఎంతో కష్టపడి రంగారావుగారి ఉనికి తెలుసుకొని వెళ్ళేడాయన ఇంటికి "రామం, బి.కాం., కుల సంఘ కార్యదర్శి, విజయవాడ" అని ఒక విజిటింగుకార్డు పంపించాడు బంట్రోతు ద్వారా.

"ఓఁ-విజయవాడలో మనవాళ్ళ కెన్ని కుటుంబా లుంటాయండి? అంతా మంచి స్థితిలోనే ఉన్నారనుకుంటాను" మొదలైన కుల విషయక కుశలప్రశ్నలైన తర్వాత "మీరే పని మీద వచ్చేరో తెలుసుకోవచ్చా?" అన్నారు రంగారావుగారు.

"నేను... నేను రెండుమూడు సంవత్సరాల నుంచీ మన కుల సంఘోద్ధరణకోసమే కృషి చేస్తున్నానండి. ఏదో మనవాళ్ళలో కాస్త పెద్ద పదవులలోనున్న తమలాంటివారి పరిచయం సంపాదించడం, మనవాళ్ళను నలుగురినీ ఒకదగ్గరకు చేర్చడం-యిదీ నా కార్యక్రమం. అయినా యిలా కేవలం సంఘసేవకే నాజీవితాన్ని అర్పించి

సంసారం చూసుకోవడమంటే యీ రోజుల్లో కాస్త యిబ్బందిగా ఉంది. అందుకని యిలాగే సేవచేస్తూ జీవనాధారంకోసం ఏదైనా ఉద్యోగం కూడా చేస్తే బాగుంటుందని ఆలోచించేను. ఏదో ఒకటి రెండు దొరికినా అంతమంచివి కావవి. మీరిక్కడున్నారని విని తమ పరిచయం వృథా పోదని ఆశతోవచ్చాను" అని డొంకతిరుగుడు సమాధానమిచ్చేడు రామం.

"సరే అప్లికేషన్ పెట్టండి ఆఫీసులో. మీ క్వాలిఫికేషన్సూ అవీ చూసి ఆలోచిస్తాను" ఈ సారి అధికారస్వరం కనిపించిందని గొంతుకలో.

"తమరలా అంటే...తమరు—"

"సరే-మీ రసలు యింటి కెందుకొచ్చేరు? అంతా ఆఫీసులో మాట్లాడదాం వెళ్ళండి" నిజాయితీ కనిపించిం దతని పలుకుల్లో!

"తమరు కరుణించాలి..." అని యింకా ఏదేదో చెప్పుకొనిపోతున్నాడు రామం. ఇంతలో ఏదో టాక్సీవచ్చి ఆగింది. "అరరే నాన్నగారా! అదేం నాన్నా ఉత్తరమైనా రాయలేదేం, కారు పంపేవాడినిగా" అంటూ రంగారావుగారు హడావిడిలో పడిపోయి, రామాన్ని మర్చిపోయి తండ్రిని తీసుకొని యింటిలోనికి వెళ్ళిపోయేరు. రామం డ్రాయింగురూములో గోళ్లు గిల్లుకుంటూ మౌనంగా కూర్చున్నారు ఆలోచిస్తూ. ఈయన ఉద్యోగమివ్వకపోతే తనే ముఖంతో యింటికి వెళ్ళడం, లక్ష్మితో మళ్ళీ ఏమని అబద్ధం చెప్పాలి, తన భవిష్యత్తేమిటి. ఆలోచిస్తున్న కొద్దీ ఆశలు సన్నగిలుతున్నాయ్, ఈ బ్రతుకు మీద అసహ్యం విరక్తి కలుగుతూంది.

"ఏమిట్రా అంత తల బిరుసు. మనం పూర్వం ఏస్థితిలో ఉండేవాళ్ళమో ఆలోచించేవ్? ఏదో మన ఊరివాడవ్, ఆమాత్రం సహాయం చేయక పోతావా అన్న ఆశ కొద్దీ, ఆ వరహాలు అప్పూ సప్పూ చేసి యిక్కడికివస్తే ఆమాత్రం రికమెండేషన్ చెయ్యలేకపోయేవ్? మ రెం దు కూ నీ చదువూ, నీ ఉద్యోగమూను? ఆపాటి మన కుల స్థులమీదా మనవాళ్ళమీదా అభిమానం లేక పోతే మరేం బ్రతుకురా-ఛీ" అని ఒక్కదులుపు దులుపుతున్నాడాయన తండ్రి. రామం యివన్నీ వింటూ ఆశ్చర్యంగా కూర్చున్నాడు.

ఇంతలో ఎదురుగా ప్రళయకాల రుద్రుడిలా రంగారావుగారు ప్రత్యక్షమయేసరికి రామం కంపించిపోయేడా విగ్రహాన్ని చూచి, మెల్లగా పిల్లిలా లేచి, "సెలవు తీసుకుంటాను" అని గొణుక్కుంటూ గుమ్మం దాటేడు.

"ఇలారండి" గర్జించేడాయన. రామానికి గుండాగిపోతూంది.

"ఏం కావాలి?"

"తమ దయ."

"మీ పేరు?"

"రామం."

"సరే వెళ్ళండి. ఆఫీసులో అప్లికేషన్ పెట్టండి రేపే జాయిన్ కావాలి ఆఫీసులో."

"థేంక్స్! తమకు నేనాజన్మాంతం కృతజ్ఞుణ్ణి!" ఉబికివస్తున్న ఆనందాన్ని కృతజ్ఞతలో నింపేయాలనుకొన్నాడు రామం.

బ్రతుకుజీవుడా అనుకుంటూ వీధిలోపడ్డాడు. వెంటనే పోస్టాఫీసుకువెళ్ళి క్షేమసమాచారాలతో ఓ ఉత్తరం రాసేడు తన సతీమణికి. మర్నాడే ఆఫీసులో ప్రవేశించేడు, నూరురూపాయల జీతం మీద. ఒక నెల గడిచిపోయింది, జీతండబ్బులు కూడా చేతికి అందేయ్. ఏదో ఒక చిన్న ఇల్లు, చూచి కుటుంబాన్ని తీసుకొని రావాలని ఆలోస్తున్నాడు.

ఇంతలో రంగారావుగారికి హఠాత్తుగా బదిలీ అయిపోయింది. ఆయన స్థలంలో హుస్సేన్‌గారు వచ్చి ఛార్జి తీసుకున్నారు. ఒక వారంరోజులు కొత్త ఆఫీసరుగారి హయాంలో సుఖంగానే గడిచిపోయేయ్.

ఆ రోజు ఆఫీసులో చిన్న కలకలం బయలుదేరింది. ఆఫీసులో ఎవరో ఒకర్ని ఉద్యోగంలోనుంచి తీసివెయ్యాలని పైనుంచి ఆర్డర్ వచ్చిందట. ఆ దురదృష్టం ఎవరి నెత్తిమీద వాలుతుందోనని అరిచేతుల్లో ప్రాణాలుపెట్టుకొని కూర్చున్నారందరూ. రామానికిమాత్రం ధైర్యంగానే ఉంది, ఎందుకంటే తనతర్వాత మరొకడుకూడా ఉద్యోగంలో ప్రవేశించేడు. అంతేకాకుండా ఆ నూతన వ్యక్తి స్కూలుఫైనలువరకే చదువుకున్నాడు. అతనికి శ్రీముఖం తప్పదని అందరూ నిశ్చయించుకున్నారు. హఠాత్తుగా పిలిచేరు రామాన్ని, హుస్సేన్‌గారు.

"మిస్టర్ రామం, ఐయామ్, సో సారీ! మీ

"ఉద్యోగం ఈనాటితో-" అని ఎంతో విచారంగా అందించేరు కాగితాన్ని.

"తమరు—"

"చాలా చింతిస్తున్నాను. కాని నేనేం చెయ్యను?"

"కటాక్షించాలి, పిల్లలు గలవాణ్ణి" అటూ ఎంత ప్రాధేయపడినా, హుస్సేన్ అంతకన్నా మరేమీ చెయ్యలేకపోయేడు. రామానికి మరేమీ గత్యంతరం తోచక, "నాకన్నా జూనియర్ సలీం ఉన్నాడు-చదువుకూడా నాకన్నా—"

"మిస్టర్ రామం, నీకదంతా అనవసరం. నీపని మాకేమీ సంతృప్తికరంగా లేదు. యుకెన్ గో, నౌ."

"సార్, ఒక్కమాట. మీరు మతపక్షపాతం చూపిస్తున్నారు."

"షటప్-యు, గెట్ అవుట్."

"థేంక్స్" అంటూ పౌరుషంగా బయటికి వచ్చేసేడు రామం. అతనికి యీ ప్రపంచంలో కులమత సంకుచితత్వాలు తప్పిస్తే మరేమీ కన్పించడంలేదు. "ఛీ" అనుకున్నాడు మనస్సులో. కాని తనెలా ఉద్యోగం సంపాదించాడో, ఏ విధంగా రైలులో స్థలం సంపాదించాడో మొదలైన విషయాలతనికి జ్ఞాపకంలేవు! బహుశా మానవ ప్రకృతంటే అదేనేమో!

---

# బాత్ ఖానా

(ఉపసంహారం)

సోదరులారా!

మన ఉపన్యాసాలు చాలామంది దృష్టిని ముఖ్యంగా రాబోయే ఆంధ్రరాష్ట్రసారథ్యంలో ప్రధానపాత్ర వహించడానికి యోగ్యతలుతున్న ప్రముఖ వ్యక్తుల దృష్టిని ఆకర్షింస్తోందని చేరిన వార్తల్ని మీఅందరికీ తెలియపరచడానికి చాలా సంతోషిస్తున్నాను. మనమీద చాలామంది సానుభూతి చూపిస్తున్నట్లు కూడా వార్తలు వస్తున్నాయి. The desire of pleasing is at least half the art of doing it అన్న Lord Avebury ప్రవచనం ప్రకారం సానుభూతి చూపడం సగం ఉపకారం చేసినట్లే అని అని మనం నిర్వచించుకుందాం. ఈ సానుభూతిపరులు తమకు అధికారంగానీ, అవకాశంగానీ వచ్చినప్పుడైనా మనకి తగిన సహాయంచేసి తమ త్రికరణశుద్ధిని వ్యక్తపరచుకుంటారని ఆశిస్తున్నాం. వారలా చేస్తారని మనస్ఫూర్తిగా నమ్ముతూ ఇప్పుడే కృతజ్ఞత తెలియపరుచుకుందాం కూడా.

ఇక గత ఉపన్యాసంలో ఉద్యోగస్తుల్ని మూడు తరగతులుగా విభజించిన విషయం మీ అందరికీ తెలిసినదే. దానికి సైదోడుగా మన సభ్యుల్ని కూడా మూడు తరగతులుగా విభజించాలనిన్నీ, అలా చెయ్యకపోతే చాలా అన్యాయము జరగడానికి చాలాచాలా అవకాశం ఉందనిన్నీ చాలామంది సభ్యులు తమ ఆవేదననూ, ఆత్రుతనూ తెలియబరుస్తున్నారనే విషయాన్ని నేను తెలియబరచడానికి చాలావిచారిస్తున్నాను. వారిఆవేదనలోనూ,ఆత్రుతలోనూ కొంత నిజంకనిపిస్తూ ఉండటంవల్ల దానిని నేను మీ అందరికీ తెలియపరచడానికి సంకోచించలేదు.

1. డబ్బూ, పలుకుబడీ ఏమాత్రంలేక కేవలం నిరాధారంగా ఉంటూ నానాఅగచాట్లూ పడుతూన్నవాళ్లు మొదటితరగతి.
2. తగినంత డబ్బూ, పలుకుబడీలేకపోయినా కాస్త వెనకదన్ను ఉన్నవాళ్లు రెండవతరగతి.
3. తమ యిష్టంమీదనే నిరుద్యోగులైనవాళ్లు అంటే ధనవంతులబిడ్డలు ఒళ్లువంగక నిరుద్యోగులైనవాళ్లు వీరు మూడవతరగతి. వీరి సంఖ్య మన సంఘంలో తక్కువఅయినా వీరిమీద మనకేం సానుభూతిలేదు. వీరి సభ్యత్వాన్ని మనం రద్దుచేస్తున్నాం, త్వరలోనే వీరికి మనసలహా ఏమంటే చక్కగా వ్యవసాయమో, వ్యాపారమో చేసుకోమని.

మొదటితరగతివాళ్ళకి ముందుగా ప్రాధాన్యం యివ్వడం మన నైతికధర్మం. దీనిని సభ్యులు దరవగాహనచేసుకోనక సుహృదయతతో ప్రవర్తించవలసినదిగా కోరుతున్నాను, సభ్యులందరి